ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మధ్యంతర గేలం!



పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మధ్యతరగతి, పేదలపై దృష్టి పెట్టింది. సామాన్యుల ఓట్లను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే బడుగు జీవుల ఆశలపై ఓట్ల వల విసిరింది. రైతులు, మహిళలకు పెద్దగా ఖర్చులేని వరాలు ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. విద్యుత్ బిల్లుల భారంతో చితికిపోతున్న పేదలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం ప్రకటించి వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. కాకపోతే పన్నుల విధానంలో ఏ మార్పు చేపట్టకుండా వేతనజీవిని ఉసూరుమనిపించింది. కొత్త విధానంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని రూ.8 లక్షలకు పెంచుతారని ప్రచారం జరిగినా కరుణించ లేదు. అటు పీఎం కిసాన్ సాయాన్ని రూ.8 వేలకు పెంచుతారని లీకులిచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వెరసి పలురకాల ఆకర్షణలే లక్ష్యంగా నిర్మలమ్మ పద్దు మమ అనిపించింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో ఓట్ల ఆకర్షణే లక్ష్యంగా సాగిన తాత్కాలిక బడ్జెట్‌లో మధ్యతరగతికి కేంద్రం తీపికబురు అందించింది. వీరికి ఇళ్ల కొనుగోలు, సొంతంటి నిర్మాణం కోసం కొత్త హౌసింగ్ స్కీం ప్రకటించింది. బస్తీలతోపాటు అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సొంతింటి కల నిజం చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల తీరబోతుందనే ఆశ పేద, మధ్యతరగతి వర్గాల్లో పెరిగింది. అయితే ఈ పథకం కింద బ్యాంకు లోన్లకు సంబంధించి రాయితీలను కేంద్రం అందించనుంది. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలైతే ఎవరు అర్హులవుతారనేదానిపై మరింత స్పష్టత రానుంది. అయితే జిల్లా కేంద్రం కాకినాడతోపాటు పలు మున్సిపాల్టీల పరిధిలోని పట్టణాల్లో వేలాది మంది సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఈ పథకంతో వారికి మరింత లబ్ధి కలగనుంది. మరోపక్క రాబోయే అయిదేళ్లలో పీఎం ఆవాస్ యోజన కింద రెండు కోట్ల ఇళ్లు కట్టిస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో జిల్లాలో భారీగా లబ్ధిదారులు పెరగనున్నారు. ఇప్పటివరకు ఈపథకం కింద జిల్లాలో 70 వేల వరకు పట్టణ, గ్రామాల్లో కేంద్రం గృహాలు మంజూరు చేసింది. విద్యుత్ బిల్లుల నుంచి సామాన్యులకు విముక్తి కలిగించేలా బడ్జెట్‌లో కేంద్రం నూతన పథకం ప్రకటించింది. నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా రూఫ్‌టాప్ సోలారైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టనుంది. దీనివల్ల గృహ వినియోగదారులకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుందని ప్రకటించింది. వాస్తవానికి జిల్లాలో 5.50 లక్షల వరకు గృహ విద్యుత్ వినియోగదారులుండగా, ఇందులో కొత్త పథకం కింద వేలాది మంది లబ్ధిపొందనున్నారు. పాడి రైతులకు సంబంధించి పశువుల్లో పాల దిగుబడి పెంచడానికి కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. పాల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. మరోపక్క ఆక్వా దిగుబడిని హెక్టారుకు మూడు టన్నుల నుంచి అయిదు టన్నులకు పెంచేవిధంగా చర్యలు చేపడతామని కేంద్రం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 7,224 హెక్టార్లలో 6,537 మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. దీనివల్ల ఎంతోకొంత మేలు జరుగనుంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకీకరిస్తామని బడ్జె ట్‌లో ప్రకటించడం కొత్త ఆశలు రేపుతోంది. జిల్లాలో 1,927 అంగన్‌వాడీ మెయిన్ కేంద్రాలు, 59 మినీ కేంద్రాలు కలిపి మొత్తం 1,986 ఉన్నాయి. వీటిలో 706 సొంత భవనాల్లోను, 1,107 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే సొంత భవ నాలున్నా అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో తాజా బడ్జెట్ ద్వారా వీటికి మంచి రోజులు రానున్నాయి. ఇదిలాఉంటే జిల్లాలో 1.63 లక్షల మంది అన్నదాతలు ఏటా పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందుతున్నారు. వీరికి ఇస్తోన్న రూ.6 వేల సాయాన్ని పెంచుతారని ప్రచారం జరిగినా మొండిచేయే మిగిలింది.

వేతనజీవికి రిక్తహస్తం..

ఏటా కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు ఎంతోకొంత ఊరట ఉంటుందని భావించడం, చివరకు భంగపాటుకు గురవడం షరా మామూలుగా మారింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ఎంతోకొంత ఆదాయపు పన్ను తగ్గింపును కేంద్రం ప్రకటిస్తుందని అంతా భావించారు. ఈ మేరకు లీకులు కూడా వెలువడ్డాయి. కానీ ఎప్పటిలాగే నిర్మలమ్మ బడ్జెట్ వేతన జీవులకు ఊరట కల్పించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఈ తాత్కాలిక బడ్జెట్‌లో పన్ను విధానాల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లలేదు. కొత్త విధానంలో ఉన్న పన్నుదారులకు రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్ను ఉండదని మాత్రం చెప్పారు. వాస్తవానికి దీన్ని ఈ మధ్యంతర బడ్జెట్‌లో రూ.8 లక్షలకు పెంచుతారని భావించినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో సామాన్యులందరికీ నిరాశే మిగిలింది. వాస్తవానికి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి మొత్తం 23 వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో వార్షిక ఆదాయం రూ.7 లక్షలు, ఆపై కొంచెం దాటిన వారు సగం మంది వరకు ఉన్నారు. కేంద్రం ఈ పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచి ఉంటే వీరందరికి భారీ ఊరట లభించేది. కానీ నిర్మలమ్మ పద్దు వీరందరినీ ఉసూరుమనిపించింది. స్లాబ్‌ల విధానాన్ని మాత్రం కుదించారు.

- పార్లమెంట్ ఎన్నికల ముంగిట మధ్యతరగతి జీవులపై కేంద్ర బడ్జెట్ ఆశల వల
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి సొంత ఇళ్లు కొనుగోలు, నిర్మాణానికి కొత్త పథకం
- పేదలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తికి రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీం
- వేతనజీవికి పూర్తిగా నిరాశే : తాత్కాలిక పద్దులో కానరాని ఆదాయపు పన్ను మార్పులు
- రూ.7 లక్షల పన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచుతారని భావించినా నిరాశే
- పీఎం కిసాన్ సాయం రూ.6 వేల నుంచి రూ.8 వేలు చేస్తారని ఎదురుచూసినా ఫ్లాప్
- పర్యాటక రంగం అభివృద్ధి, ప్రచారం కోసం వడ్డీ రహిత రుణాలతో ఊపు
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ ప్రకటనతో జిల్లాలో అనేక కేంద్రాలకు మోక్షం

'పోలవరం' మాటేమిటి?

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా పోలవరానికి ప్రత్యేక నిధులు కేటాయించిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. పూర్తి వివరాలు వస్తే మరింత స్పష్టత రావొచ్చు. నిజానికి ఆర్‌అండ్‌ఆర్ పూర్తి స్థాయిలో అమలుచేయడంగాని, ప్రాజెక్టును పూర్తి చేయడానికి గాని కేంద్రం ఇచ్చే నిధులే ప్రధాన ఆధారం. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ ఈ ప్రాజెక్టుకు ఎన్నికల నేపథ్యంలోనైనా న్యాయం జరుగుతుందని రైతులు ఆశించారు. ఆ దిశగా నిధుల కేటాయింపు జరిగినట్టు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పర్యాటకంపై ఆశలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంటేనే పర్యాటక రంగానికి ప్రసిద్ధి. అటు ఆధ్యాత్మిక టూరిజం, ఇటు రివర్, ఎకో టూరిజం, ఇంకోవైపు బీచ్ టూరిజంపరంగా అద్భుతమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. అయితే అభివృద్ధి మాత్రం అంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం కొత్త బడ్జెట్‌లో పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. పర్యాటక రంగ అభివృద్ధి, అక్కడ అందే సేవల ఆధారంగా ఈ పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి దామాషా పద్ధతిన ఆ కేంద్రాల అభివృద్ధికి వడ్డీ రహిత రుణాలందించాలని భావిస్తున్నట్టు బడ్జెట్‌లో ఉదహరించారు.ఇదే అమల్లోకి తెస్తే కోట్లాది రూపాయలు ఆయా పర్యాటక ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసే అవకాశం ఉంది. కచ్చితంగా ఏపీకి వచ్చేసరికి ఉమ్మడి తూర్పుగోదావరికి ప్రయోజనం చేకూరుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో బీచ్ టూరిజానికి మహర్దశ పట్టే అవకాశం ఉంది.

ఏదో చేస్తామని ఊరించి నిరాశపరిచారు



రైతాంగానికి ఏదో చేస్తామని ఊదరగొట్టి తీరా బడ్జెట్ వచ్చేసరికి నిరాశపరిచారు. పీఎం కిసాన్‌యోజనా పథకం ద్వారా రైతులకు ఏటా ఇచ్చే సాయాన్ని పెంచుతామని చెప్పినా ప్రకటన రాలేదు. రైతులకు మద్దతు ధర పెంపు, ఇతర రాయితీల విషయంలో బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఉన్న పథకాలు కొనసాగింపుపైనే మాట్లాడారు. రైతులకు ఊరట కలిగించే ప్రకటన వస్తే బాగుండేది.

- అనంతగిరి వెంకటేశ్వరరావు, రైతు, విరవ, పిఠాపురం మండలం

బడ్జెట్‌లో కొత్తదనం కొరవడింది



కేంద్ర బడ్జెట్‌లో కొత్తదనం కొరవడింది. పాత పథకాలనే ఆర్థికమంత్రి తన ప్రసంగంలో చెప్పుకొచ్చారు. జీఎస్టీ, ఇతర పన్నుల్లో రాయితీలు లేకపోవడం నిరాశకు గురిచేసింది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచుతారని భావించినా జరగలేదు. వ్యాపారవర్గాలకు బడ్జెట్‌లో ఏ ప్రతిపాదనలు లేవు.

- క్రోవి పాండురంగారావు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారి, పిఠాపురం

వేతన జీవులను నిరాశపరిచిన బడ్జెట్



రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ఈ భారీ బడ్జెట్ సగటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక లోకానికి అనగా వేతన జీవులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. వార్షిక ఆదాయం రూ.7 లక్షల వరకు పన్ను లేదని ప్రకటించినా ఇతర ఏ రకమైన మినహాయింపులు లేకపోవడం దారుణం. విదేశీ పెట్టుబడులు తగ్గినా పెరిగినట్టు చెప్పడం హాస్యాస్పదం. ఒకపక్క పేదరికం, నిరుద్యోగం పెరుగుతున్నా తగ్గిందని చెప్పడం విడ్డూరం.

- ఐ.ప్రసాదరావు, గురజనాపల్లి హైస్కూల్ టీచర్, కరప మండలం

కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు శుభ పరిణామం



కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి కుదించడం శుభపరిణామం. కనిపించని ఖర్చుతో సతమతమయ్యే వ్యాపారవేత్తలకు ఇది అనుకూలాంశమే. బడ్జెట్‌లో రూ.7 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించడం బాగానే ఉంది. రూ.25 లక్షల కోట్లు ముద్రా రుణాలతో యువత ఆర్థికాభివృద్ధికి దోహదపడిందని చెప్పాలి. స్టార్టప్‌లు, వ్యాపార రంగంలో యువకులు ముందుకు రావడానికి ప్రయోజనాలు కల్పించాలి.

- చిక్కాల సుబ్బారావు, వ్యాపారవేత్త, సిరిపురం, కరప మండలం.

బీజేపీ ప్రభుత్వానికి ఇదే ఆఖరి బడ్జెట్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇదే ఆఖరి బడ్జెట్. ఈ ప్రభుత్వానికి మరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేదు. సామాన్యుడిపై పెనుభారం మోపేలా కేంద్రం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఉంది. ఇటువంటి బడ్జెట్ వల్ల ధనవంతుడు మరింత ధనవంతుడు. పేదవాడు మరింత పేదవాడు అవుతాడు. దోచుకోవడానికి.. దాచుకోవడానికి అన్నట్టుగా బడ్జెట్ రూపొందించారు. స్వలాభం కోసం.. దేశ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసేలా, కార్పొరేట్‌లకు మేలు చేకూర్చేలా కేంద్ర తాత్కాలిక బడ్జెట్ ఉంది.

- చిలుకోటి పాండురంగారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

ఓట్ల కోసమే ఈ బడ్జెట్



సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ఓట్ల కోసం 2024 కేంద్ర బడ్జెట్ ఉంది. అనేక రకాల పన్నులతో ప్రజలపై భారాలను మోపి, ముక్కుపిండి వసూలు చేసి... తుదకు సామాన్య ప్రజలకు, రైతులకు కంటితుడుపుగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. ఒకపక్క దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. రూపాయి విలువ పతనం అయిపోయింది. ధరలు పెరిగి, ప్రజలపై భారాలు పడుతున్నాయి. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. కానీ వేటికీ తగిన నిధులు కేటాయింపులు లేకపోవడం దారుణం. రాబోయే ఎన్నికల్లో ప్రజల ఓట్లు దండుకోవడం కోసం బీజేపీ ప్రభుత్వం అంకెలు గారడీలు చేస్తోంది. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు ఐక్యంగా బీజేపీ మతోన్మాదం దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి.

- కర్నాకుల వీరాంజనేయులు,
ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దుమ్మురేపుతున్నారు..

- అడ్డూఅదుపూ లేని అక్రమ తవ్వకాలు
- పంట పొలాలు చదును పేరుతో యథేచ్ఛగా గ్రావెల్, మట్టి అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- మితిమీరిన వేగంతో దూసుకుపోతున్న క్వారీ లారీలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు, మూగజీవాలు
- నెలలుగా సాగుతున్నా పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు



మితిమీరిన వేగంతో దుమ్ము రేపుతూ దూసుకుపోతూ టిప్పర్ లారీ

పెద్దాపురం, ఫిబ్రవరి1: పెద్దాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. పట్టించుకునే నాథుడే కరువ్వడంతో గ్రావెల్ అక్రమ తవ్వకందార్ల వ్యాపారం మూడు ట్రిప్పులు ఆరు లారీలుగా సాగుతోంది. పైగా గ్రావెల్ తవ్వకాలు సాగించే వ్యక్తుల ఆగడాలకు హద్దు అదుపు లేకుండాపోతోంది. పెద్దాపురం పరిసర ప్రాంతాలైన ఆనూరు, వాలుతిమ్మాపురం, ఆర్‌బీ పట్నం, సీబీ దేవం, కట్టమూరు, కాండ్రకోట, మర్లావ, అలాగే పట్టణ పరిధిలోని హోప్ విలేజ్ తదితర ప్రాంతాల్లో ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వేయడంతో అక్రమార్కులు కోట్లు సంపాదిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సెస్సు ఏదో నామమాత్రంగా చెల్లించి ఇబ్బడిముబ్బడిగా తవ్వకాలు సాగించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రాత్రి పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్ల సహాయంతో తవ్వకాలు సాగిస్తున్నారు. పైగా క్వారీ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటుచేసి క్వారీలోకి ఇతరులు రాకుండా ముందే వారిని నిలువరించడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా ఆ వైపు రెవెన్యూ మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రాణాలు హరిస్తున్న క్వారీ గోతులు

క్వారీ యజమానులు ఇష్టానుసారం తవ్వకాలు సాగించడంతో క్వారీ ప్రాంతంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇటీవలకాలంలో ఈ క్వారీ గోతుల్లో పడి పలువురు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. అలాగే మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. సుమారు రెండు నెలల కిందట హోప్ విలేజ్ వెనుక ప్రాంతంలో ఉన్న క్వారీ గోతుల్లో జె.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓ యువతి పడి మృతి చెందింది. అలాగే ఆర్‌బీ పట్నం గ్రామంలో క్వారీ గోతుల్లో పడి రెండు పాడి గేదెలు మృతి చెందాయి. వర్షం పడిన తరువాత క్వారీ గోతుల్లో నిండుగా నీరు చేరడంతో అంచనాలు తెలియక ప్రజలు, మూగజీవాలు మృత్యువాత గురవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 15 నుంచి 20 అడుగుల లోతు మేర తవ్వకాలు సాగిస్తుండడంతో పర్యావరణానికి కూడా పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. పైగా పరిసర ప్రాంతాల్లో ఉన్న పంటలకు క్వారీల నుంచి వెలువడే దుమ్ముతో కళావిహీనంగా మారడంతోపాటు నష్టం కూడా జరుగుతోందని వాపోతున్నారు.

మితిమీరిన వేగంతో వెళుతున్న టిప్పర్లు

గ్రావెల్ టిప్పర్లు మితిమీరిన వేగంతో దూసుకుపోవడంతో రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాహనాల వేగానికిఅడ్డూ అదుపూ లేకపోవడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఏలేశ్వరం పట్టణానికి చెందిన దంపతులు క్వారీ లారీల కారణంగా తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఏడీబీ రహదారిలో పలువురు మృత్యువాతకు గురయ్యారు. పట్టించుకోవాల్సిన రవాణా శాఖ మొద్దునిద్రలో ఉండడంతో ప్రజల ప్రాణాలకు విలువలేకుండాపోయింది. అసలే రహదారులు అధ్వానంగా ఉండడంతో పరిస్థితి మరీ భయానకంగా తయారయ్యింది. ఏ క్షణం ఏం జరుగుతుందో అన్న భయాందోళన మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. తక్షణమే విజిలెన్స్ అధికారులు గ్రావెల్ క్వారీల్లో తనిఖీలు నిర్వహించాలని, అలాగే రవాణాశాఖ అధికారులు వాహనాల వేగానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ల హల్‌చల్‌తో కూలిన ఇంటి పిట్టగోడ



గ్రావెల్ ట్రాక్టర్ల అదురుకు కూలిపోయిన ఇంటి పిట్టగోడ

రౌతులపూడి, ఫిబ్రవరి1: గుమ్మరేగుల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ల రాకపోకలతో వచ్చిన అదురుకు తన ఇంటి పిట్టగోడ పడిపోగా, గోడ బీటలు వేసిందని బండారు నారాయణమ్మతోపాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఉరకొండ నుంచి గత పది రోజులుగా గ్రామ మధ్యలో నుంచి ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారని, రాత్రీపగలూ తోలడంతో ట్రాక్టర్ల శబ్దాలతో కంటి మీద కునుకు కూడా లేకుండా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వేగంగా ట్రాక్టర్లు వెళ్లడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని, ఎటువంటి అనుమతులు లేకుండా ఉరకొండ నుంచి గ్రావెల్ తవ్వుతున్నారని వారు ఆరోపించారు. గ్రావెల్ తవ్వకాలపై ట్రాక్టర్ ఆపి నిలదీస్తే ఉరకొండను కోటి రూపాయలకు కొనుగోలు చేసేమని దురుసుగా సమాధానం చెబుతున్నారని బంగారు నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. గుమ్మరేగుల గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌తో కోట్లు విలువ చేసే రియల్ ఎస్టేట్ స్థలాలను కప్పుకుంటున్నారని, ఇదంతా తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేత అండదండలతో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పలువురు డీఎస్పీలకు స్థాన చలనం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి1: కాకినాడ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న పలువురు డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్, వెస్ట్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న కె.హనుమంతురావుకు కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీవో)గా స్థానచలనం కల్పించారు. అక్కడ పనిచేస్తున్న పి.మురళీకృష్ణారెడ్డి విజయవాడ వెస్ట్ ఏసీపీగా స్థానచలనం పొందారు. అలాగే ఏసీబీ అటాచ్డ్‌గా ఉంటూ కాకినాడ ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాంబాబు విశాఖపట్నం ద్వారక ఏసీపీగా బదిలీ అయ్యారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న బి.అప్పారావు రాజమహేంద్రవరం ఎస్‌బీ-1 డీఎస్పీగా స్థానచలనం పొందారు. కాకినాడ దిశ డీఎస్పీగా పనిచేస్తున్న బీఎం జయరాంప్రసాద్‌ను విశాఖపట్నం ఈస్ట్ ఏసీపీగా బదిలీచేస్తూ డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు ఇచ్చింది.

తహశీల్దార్‌లకు పోస్టింగులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన 23 మంది తహశీల్దార్‌లకు కాకినాడ జిల్లాలో పోస్టింగ్‌లిస్తూ జిల్లా కలెక్టర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎండీ ముస్తాఖ్ అహ్మద్ (లేండ్ రిఫార్మ్స్ రీటైన్డ్ ఆథరైజ్డ్ ఆఫీసర్), జీఎస్ఎస్ శ్రీనివాస్ (కలెక్టరేట్ రీటైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), పి.శ్రీనివాసరావు (కలెక్టరేట్ సూపరింటెండెంట్), కె.సుబ్రహ్మణ్యం (పెద్దాపురం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), బి.సాయిసత్యనారాయణ (కాకినాడ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), జె.చిరంజీవి (గండేపల్లి తహశీల్దార్), ఏఎస్ఎన్ రాధిక (కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్), బి విజయ్‌ప్రసాద్ (కాకినాడ రూరల్ తహశీల్దార్), వి. రామకోటేశ్వరరావు (కరప తహశీల్దార్), వీవీ భరత్‌రెడ్డి (తుని తహశీల్దార్), ఎస్కే ఇంతియాజ్ పాషా (కోటనందూరు తహశీల్దార్), గద్దం బాలకృష్ణారెడ్డి (తొండంగి తహశీల్దార్), ఎస్ నరసింహరావు (ప్రత్తిపాడు తహశీల్దార్), బి.ఏసయ్య (కిర్లంపూడి తహశీల్దార్), ఎం.సూర్యారావు (జగ్గంపేట తహశీల్దార్), ఎస్.శ్రీనివాసరెడ్డి (సామర్లకోట తహశీల్దార్), వి.రాజకుమారి (శంఖవరం తహశీల్దార్), ఎం.శ్రీనివాసరావు (రౌతులపూడి తహశీల్దార్), కలి లక్ష్మి (పిఠాపురం తహశీల్దార్), ఎం.శ్రీనివాసు (పెద్దాపురం తహశీల్దార్), వి.రంగారావు (ఏలేశ్వరం తహశీల్దార్), కె.రాజ్‌కుమార్ (యు కొత్తపల్లి తహశీల్దార్), ఎం ఉదయ్‌భాస్కర్ (గొల్లప్రోలు తహశీల్దార్)గా నియమితులయ్యారని జిల్లా కలెక్టరేట్ వర్గాలు తెలియజేశాయి.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

- 7లో



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్ర సింగ్

వారసత్వ సంపదను కాపాడాల్సింది పాలకులే

- కాకినాడ నగరానికి పొంచిఉన్న పర్యావరణ ముప్పు
- రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి1: వారసత్వ సంపదను పాలకులు కాపాడాల్సి ఉందని, పొంచి ఉన్న పర్యావరణ ముప్పు వల్ల కాకినాడ నగరం ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడిందని ప్రపంచ ప్రజా కమిషన్ చైర్మన్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ పేర్కొన్నారు. వారసత్వ సంపద సంరక్షణపై గురువారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో చర్చ నిర్వహించారు. కార్యక్రమానికి పీడబ్ల్యుసీడీఎఫ్ కో-ఆర్డినేటర్ పెసింగి ఆదినారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డాక్టర్ రాజేంద్రసింగ్ మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారసత్వ సంపదల్లో ప్రకృతి వనరులు, మడ అడవులు, హోప్‌ఐలాండ్, తూర్పు తీర ప్రాంత పర్యావరణం అన్నీ భాగమేనన్నారు. కాకినాడలో వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. చారిత్రక కట్టడాలు వారసత్వ సంపద సమాజం మొత్తానికి చెందుతుందన్నారు. వీటిని పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. కాకినాడలో చారిత్రాత్మక ఎంఎస్ఎన్ ఛారిటీస్ భూములను కొల్లగొట్టాలని చూస్తున్నారని, పీఆర్ కళాశాల, మెక్లారిన్ పాఠశాల కోస్తా తీర ప్రాంతాలను కాపాడుకోవాలంటూ హితవు పలికారు. కాకినాడలో ఉన్న వారసత్వ సంపదను, పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు కలసికట్టుగా పయనించాలని తీర్మానించారు. కాకినాడ చరిత్రకు సంబంధించి తమ వద్ద ఉన్న బుక్‌లెట్లను రాజేంద్ర సింగ్‌కు అందజేశారు. అంతకుముందు కాకినాడకు చెందిన పలువురి నుంచి సలహాలు, సూచనలు తెలుసుకుని వాటిపై చర్చించారు. ఈ చర్చ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, సామాజిక వేత్తలు చిక్కాల దొరబాబు, పి శివశంకర్, టీకే విశ్వేశ్వరరెడ్డి, కె మృత్యుంజయరావు, ఐ దోసగిరిరావు, గూడూరు వెంకటేశ్వరరావు, వక్కలంక రామకృష్ణ, చిక్కాల అబ్బు, నందమూరి వినోద్, దూసర్లపూడి రమణరాజు, పెద్దింశెట్టి రామకృష్ణ, పోలసపల్లి సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలేవీ

- పోలింగ్ కేంద్రాల్లో కానరాని ఓటర్ల జాబితా
- ఇలా పెట్టి అలా తీసుకువెళ్లిన వైనం
- ప్రజలకు అందుబాటులో ఉంచాలంటున్న రాజకీయ పార్టీలు



చేపూరు గ్రామంలో ఓటరు జాబితా లేని పోలింగ్ స్టేషన్

తుని రూరల్, ఫిబ్రవరి 1: ఇప్పటికే విడుదలైన ఓటర్ల జాబితాలను ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాల్సి ఉంది. అధిక శాతం పోలింగ్‌బూతుల్లో వీటి జాడ కానరావడంలేదు. ఎన్నికల సంఘం జనవరి 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేసింది. వాటిని ప్రతి పోలింగ్ కేంద్రం, పంచాయతీ కార్యాలయం, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోను జాబితాను వేలాడదీయాలి. జిల్లాలో 1637 పోలింగ్ కేంద్రాలుండగా జనవరి 23న జాబితా ప్రదర్శించినట్టు ఫొటోలు తీసుకుని వాటిని బీఎల్‌వోలు తమ వెంట తీసుకెళ్లిపోయారు. జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడానికి కేంద్రానికి వెళ్లిన వారంతా కనిపించకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఈ విషయమై బీఎల్వోలను ప్రశ్నిస్తే వాటిని పోలింగ్ కేంద్రాల వద్ద వేలాడదీశామని బదులిస్తున్నారు. కొందరు ఎవరో పట్టుకుపోయారని చెబుతున్నారు. ఎవరైనా నిలదీస్తే ఎవరైనా తీసుకుపోతారని తీసి తమ వద్దే భద్రపరిచామని అంటున్నారు. ఇక ముసాయిదా జాబితాలో కనిపించిన తప్పులే తుది జాబితాలో దర్శనమిస్తున్నాయి. శాశ్వతంగా వలసవెళ్లినవారు, మృతిచెందిన ఓటర్ల పేరు, డోర్ నెంబర్ల తప్పులు, ఓ వ్యక్తికి రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు దర్శనం వంటి తప్పిదాలు తుది జాబితాలో కనిపిస్తున్నాయి. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించకపోవడానికి కారణం ఇదేనని తెలుస్తోంది. తుది జాబితాలో తుప్పులుంటే ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఉద్యోగులు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

పురాతన సంపదను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 1: కాకినాడ నగరంలోని పురాతన సంపదను, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో యూసీఈకే, ఐఎస్టీ విద్యార్థులతో వారసత్వ సంపద రక్షణ కోసం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. జంగిల్ బుక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఓడీఎల్ డైరెక్టర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేంద్రసింగ్ మాట్లాడుతూ రాజస్థాన్ నీటి కొరత, గంగా ప్రక్షాళన, నీటి లభ్యతను అంచనా వేయడం, జోర్డాన్ జలాలకు సంబంధించిన సిరియా సంక్షోభం, భూమిలోని నీటిని సంరక్షించడంలో విద్యార్థుల పాత్ర వివరించారు. ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా ఆరుసార్లు సిరియాను సందర్శించిన అనుభవంతో విద్యార్థులకు పలు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎస్టీ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ, డాక్టర్ సత్యాజీరావు, సత్య, మాజీ మేయర్ సరోజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్లతో మిర్చి పంట మటాష్



గన్నవరంలో మిర్చి పంటను పీకేస్తున్న కూలీలు

- విలీన మండలాల్లో 90 శాతం దెబ్బతిన్న మిర్చి
- ఆశతో పంటను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు
- అయినా ఫలితం దక్కక పంటను పీకేస్తున్న రైతులు
- ఆ పొలాల్లో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు

ఎటపాక, ఫిబ్రవరి 1 : ఆరుగాలం కష్టపడి, రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట దిగుబడుల కోసం ఎదురుచూస్తున్న మిర్చి రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. గత నాలుగేళ్లుగా వరుస నష్టాలను మూటగట్టుకుని ఈ ఏడాది గంపెడాశతో మిర్చిని సాగు చేశారు. ఈ ఏడాది కూడా మిర్చి రైతుకు కాలం కలిసిరాలేదు.. ఈ ఏడాది కూడా నష్టాన్ని చవిచూసే పరిస్థితి నెలకొంది.. విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 6 వేల ఎకరాల పైనే మిర్చి పంట సాగు చేశారు. అయితే పంట సాగు చేసిన రెండు, మూడు నెలల కాలం తర్వాత మిర్చికు తెగుళ్లు ఆశించాయి. తెగుళ్లతో పంట ఎదుగుదల నిలిచి, పూత, మొదటి దశలో ఆగిపోయింది. దాంతో తెగుళ్లు సోకిన పంటకు రైతులు అనేక రకాల మందులు పిచికారీ చేసినా, ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ బాగున్నాయని భావించిన మిర్చి చేలకు డిసెంబరులో



గౌరిదేవిపేటలో మిర్చిపంటను పీకేసి పొగాకు సాగు చేసిన దృశ్యం

వచ్చిన తుఫాన్ మరింత దెబ్బతీసింది. తుఫాన్ దాటికి పూత రాలిపోయింది. ఇవేకాక పంటకు గతేడాది వ్యాపించిన నల్లితామర పురుగు కూడా పంటకు ఆశించడంతో మిర్చి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దెబ్బతిన్న పంటను రైతులు వదులుకోక ఆశతో మందులు పిచికారీ చేస్తూ వచ్చారు. అదనపు పెట్టుబడులు తప్ప పంట లో ఎటువంటి మార్పు కన్పించకపోవడంతో రైతులు పంటపై చివరకు ఆశలు వదులుకుని దున్నేస్తున్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాల దిగుబడి వచ్చే మిర్చి, తెగుళ్లతో ప్రస్తుతం 2,3 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు. తెగుళ్లు సోకిన మూడు, నాలుగు నెలల పంటను కూడా పీకేస్తున్నారు. ఆ పొలాల్లో తిరిగి మొక్కజొన్న, పొగాకు వంటి పంటను సాగు చేస్తున్నారు.

తెగుళ్లు, నకిలీ విత్తనాలతో 3 ఎకరాల పంటను పీకేశా



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చిపంట సాగు చేశాను. ఇందులో మూడు ఎకరాల పంటకు తెగులు, నకిలీ విత్తనాలతో పంట మొత్తం దెబ్బతింది. మూడు ఎకరాలకు దాదాపు మూడున్నర లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టాను. క్వింటా దిగుబడి కూడా రాలేదు. మూడున్నర లక్షలు నష్టపోయా.. ఇక రైతులు మిర్చి సాగు చేసే పరిస్థితి ఉండదు.

● మండలపు శ్రీనివాసరావు, రైతు, గన్నవరం.

పెద్ద పులి సంచారంతో భయంభయం

- జల్లెడ పడుతున్న అధికారులు.. అయినా చిక్కని వైనం
- భయాందోళనలో వివిధ గ్రామాల ప్రజలు
- బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులు

గోపాలపురం, ఫిబ్రవరి 1: పెద్దపులి సంచారంతో మండలంలో ప్రజలు భయందోళనలు చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ద్వారకా తిరుమల, నల్లజర్ల మండలాల్లోని అడవుల్లో సంచరించిన పెద్దపులి గురువారం ఉదయానికి దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల మధ్య సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో పంట గ్రామాల్లో టాంటాంలు వేయించి అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేసే పనిలో పడ్డారు. ఒక పక్క పులి సంచారాన్ని అడుగడుగునా గమనిస్తున్న అటవీ శాఖాధికారులు మరో పక్క ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాదవోలు రెవెన్యూ పరిధి దాటి వాదాలకుంట గ్రామ శివారులో ఉన్న గాడి చెరువు సమీపంలోని గద్దే ఈశ్వరుడుకు చెందిన పొగాకు తోటలో పెద్దపులి జాడలు కనపడటంతో రైతులు భయందోళన చెందారు. ఈ విషయం అటవీశాఖాధికారులకు తెలియడంతో పులిని జాడలను వెంబడిస్తూ సాయంత్రానికి కరిచర్లగూడెం,



పులి పాదముద్రలు



జాడ కోసం అమర్చిన సీసీ కెమెరా

కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మ మెట్ట వెనుక భాగంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. దీంతో కరిచర్లగూడెం, కోమటిగుంట, వాదాలకుంట, వెదుళ్లకుంట, జగన్నాథపురం, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో టాంటాంలు వేయించి సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దంటూ ఒంటరిగా తిరగవద్దని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి ధర్మరాజు ఇచ్చిన వివరాల ప్రకారం గత పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులిని వెంబడిస్తున్నామని గురువారం సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మమెట్ట వద్దకు పెద్దపులి చేరినట్లు గుర్తించామన్నారు. తమ అంచనా ప్రకారం కరగపాడు మీదుగా పోలవరం పాపికొండల ప్రాంతానికి వెళ్లవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

తాడిపూడి ఇసుక ర్యాంపులో చిరుత

భయాందోళనలో స్థానికులు

తాళ్ళపూడి, ఫిబ్రవరి 1: తాళ్ళపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపులో గురువారం చిరుత పులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తించారు. గోదావరి తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లడాన్ని అక్కడ పని చేసే సిబ్బంది చూసి భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న షెడ్డులో దాక్కున్నారని తెలిపారు. దూరం నుండే నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాన్ని వీడియోలో బంధించారు. చిరుత పులి తాళ్లపూడి గ్రామం వైపుగా వెళ్లిందని చెప్పడంతో గోదావరి తీర ప్రాంత వాసులు కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అంతేగాక జిల్లాలో తిరుగుతున్న ఈ పులుల బెడదతో ప్రజలు హడలిపోతున్నారు.

ఆటో-బైక్ ఢీ: ఇద్దరి మృతి



మాధవరావు (ఫైల్‌ఫోటో)



సంఘటన స్థలంలో మృతదేహాలు

కొత్తపేట, ఫిబ్రవరి 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల శివారు చౌదరిపురం సమీపంలో గురువారం ఆటో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైనట్టు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు (43) తండ్రి నరసింహారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొత్తపేట మండలం వాడపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పలివెల మీదుగా ముమ్మిడివరప్పాడు బయల్దేరారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే (35) ప్రయాణికులు లేని ఆటోతో పలివెల సమీపంలోని కూలీలను ఎక్కించుకునేందుకు వస్తున్నాడు. చౌదరిపురం సమీపంలో మాధవరావు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో డ్రైవర్ నేరుగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మాధవరావు, ఆటో నడుపుతున్న మోషే అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన నరసింహారావును మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాలను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జ్వాలాసాగర్ తెలిపారు.

పలువురు డీఎస్పీలు బదిలీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలోని డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మను అనకాపల్లి డీటీసీకి పంపించారు. నాలుగున్నరేళ్ల నుంచీ ఆయన అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కాకినాడలోని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.అప్పారావును నియమించారు. సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణను రామచంద్రాపురం ఎస్‌డీపీవోగా, డీఎస్పీ క్రైమ్స్ జీసీ గురునాథ్‌బాబును సత్తెనపల్లి ఎస్‌డీపీవోగా, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మను నరసారావుపేట ఎస్‌డీపీవోగా, రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులును నార్త్ జోన్‌కి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావును సత్యసాయి జిల్లా దిశాకు, చిత్తూరు ఎస్‌డీపీవో కె.శ్రీనివాసమూర్తిని రాజమండ్రి క్రైమ్స్ డీఎస్పీగా, సత్తెనపల్లి ఎస్‌డీపీవో బి.ఆదినారాయణను తూర్పుగోదావరి దిశా డీఎస్పీగా బదిలీ చేశారు. రాజమండ్రి రైల్వే పోలీస్ డీఎస్పీ (డీఎస్ఆర్‌పీ), టీవీఎస్ నాగేశ్వరరావు విజయవాడ డీఎస్ఆర్‌పీగా వెళ్లగా ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎల్.మోహన్‌రావును నియమించారు.

ఇకపై అమృత్‌భారత్ స్టేషన్ పనులు వేగవంతం

సామర్లకోట, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌లో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని కాకినాడ, తుని, నిడదవోలు రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. బడ్జెట్‌లో అమృత్‌భారత్ స్టేషన్లకు మరిన్ని నిధులు కేటాయించడంతో పనులు పరుగులు పెట్టనున్నాయి. గత ఏడాది ఆగస్టు 6న వర్చువల్ విధానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజలు ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో కాకినాడకు రూ.11.50 కోట్లు, తుని స్టేషన్‌కు రూ.9.50 కోట్లు నిధుల కేటాయింపులు జరగగా శుక్రవారం నాటి బడ్జెట్ కేటాయింపులలో అమృత్‌భారత్ స్టేషన్ల అభివృద్ధికి సంబంధించి నిధుల విడుదలకు లైన్‌క్లియర్ అయ్యింది. తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలుకు రూ. 19.33 కోట్లు విడుదల కానున్నట్లు రైల్వే ఉన్నతాధికారి గురువారం రాత్రి చెప్పారు. ఇవి గాకుండా విజయవాడ డివిజన్ పరిధిలో మరో 8 రైల్వే స్టేషన్లకు అమృత్‌భారత్ పథకంలో నిధులు విడుదల కానున్నాయి. అలాగే విజయవాడ-విశాఖ మధ్య మూడో ట్రాక్ పనులు గురువారం నాటి బడ్జెట్ నిధుల కేటాయింపులతో మరింత వేగవంతం కానున్నాయి. చిరకాల వాంఛగా ఉన్న మూడో ట్రాక్ పనులు ఇప్పటికే చెన్నై నుంచి గుంటూరు వరకూ దాదాపు పూర్తయినట్లు సమాచారం. గత ఏడాది రైల్వే జీఎం సైతం సామర్లకోట నుంచి ఇటు విశాఖకు, అటు విజయవాడ మధ్య మూడో ట్రాక్ ఏర్పాటుకు ప్రస్తుత ట్రాక్ సామర్థ్యాన్ని సైతం విండో సీయింగ్ ద్వారా పరిశీలించిన విషయం విదితమే. తాజాగా గురువారం నాటి రైల్వే బడ్జెట్‌లో మూడో ట్రాక్ పూర్తికి కూడా నిధుల కేటాయింపులు జరగగలవని రైల్వే అధికారులు చెప్పారు. కాగా ఆంధ్రా-తెలంగాణా మధ్య దూరాన్ని మరింత దగ్గర చేసేందుకు కొవ్వూరు-భద్రాచలం మధ్య నూతన రైల్వే లైన్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుగుతాయని కొండంత ఆశతో ఎదురుచూపులు చూసిన ఈ ప్రాంత ప్రయాణికులు బడ్జెట్‌లో దీనిపై ఏమాత్రం ప్రస్తావించకపోవడం పట్ల తీవ్ర నిరాశ చెందాల్సి వచ్చిందని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు యార్లగడ్డ దశరథ రామారావు చెప్పారు.

సౌత్‌జోన్ సైన్స్‌ఫెయిర్‌లో ప్రత్యేక బహుమతి



చైతన్యకు ప్రత్యేక బహుమతి అందిస్తున్న దృశ్యం

బిక్కవోలు, ఫిబ్రవరి 1: విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన కెఎల్ఎస్ చైతన్య ప్రత్యేక బహుమతి గెల్చుకున్నాడని హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాలు పాల్గొన్న ఈ సైన్స్ ఫెయిర్‌లో చైతన్య లైఫ్ సేవింగ్ లోకాస్ట్ వెంటిలేటర్‌ను ప్రదర్శించి ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ పి.ప్రతాపరెడ్డి, ఎండీఎం డైరెక్టర్ శోభికా, ఆర్‌జేడీ నాగమణి నుంచి ప్రత్యేక బహుమతి తీసుకున్నాడన్నారు. ఈ సందర్భంగా చైతన్యను, గైడ్ టీచర్ శ్రీనివాసుల రెడ్డిని పలువురు అభినందించారు.

ఖాతాల్లో డబ్బులు మాయమవుతున్నాయి

బయోమెట్రిక్, ఈకేవైసీ అనంతరం సొమ్ములు ఆటోమేటిక్‌గా మాయం

లబోదిబోమంటూ బ్యాంకులకు పరుగులు తీసిన ఖాతాదారులు



పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

రావులపాలెం, ఫిబ్రవరి 1: గ్రామాల్లో కులగణన పేరిట సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. ఆ సమయంలో బయోమెట్రిక్‌తో వేలిముద్రలను తీసుకుంటున్నారు. అయితే అనంతరం బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు మాయమవుతున్నాయని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో ఇలా బ్యాంకు ఖాతాల్లో సొమ్ము మాయంపై బాధితులు బ్యాంకు అధికారులు, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కులగణన సర్వేకు సంబంధించి వేలిముద్ర వేసిన అనంతరం కొందరికి పది నిమిషాలు, కొందరికి రోజు వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు మాయమవుతుండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ-కేవైసీ చేసిన అనంతరం కూడా బ్యాంకు ఖాతాల్లోని నగదు వారి ప్రమేయం లేకుండానే మాయమవుతోంది. బాధితులు బ్యాంకులకు వెళ్లి అధికారులను అడుగుతున్నారు. మీరు ఎక్కడైనా బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశారా అని వారు తిరిగి ప్రశ్నిస్తున్నారు. కులగణనకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈకేవైసీ సమయంలోను బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేశామని బాధితులు తెలిపారు. ఇది సైబర్ క్రైమ్ అని... దీనిపై పోలీసులను ఆశ్రయించమని బ్యాంకు అధికారులు సూచించారు. ఇప్పటి వరకు మొబైల్‌కు నగదు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇదంతా చూస్తే బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. మండల పరిధిలోని పొడగట్లపల్లి, ఈతకోటల్లో కులగణన పేరిట వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించారు. అనంతరం ఐదు గంటల వ్యవధిలో రూ.9,900, రూ.5 వేలు, రూ.1,300, రూ.1,300 నగదు వారి ఖాతాల నుంచి మాయమైంది. రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-కేవైసీ అనంతరం తమ ఖాతాల్లో రూ.5వేలు, రూ.9,900 చొప్పున నగదు మాయమైందని సుమారు ఐదుగురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్, ఈతకోటకు చెందిన మానే ప్రసాద్ మరి కొందరు బాధితులతో కలిసి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి పథకానికీ వేలిముద్రలు తీసుకుంటోంది. వ్యక్తిగత సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. వేలిముద్రలు తీసుకోకుండా కులగణన సర్వే నిర్వహించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తుత్తి డీఎస్సీలెందుకు?

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథ్‌బాబు

రాజానగరంలో ఎస్టీయూ నిరసన ప్రదర్శన

రాజానగరం, ఫిబ్రవరి 1 : ప్రభుత్వం ఇన్ని రోజులూ మెగా డీఎస్సీ అని ఊదరగొట్టి ఇప్పుడు కేవలం ఆరువేల పోస్టులతో ఉత్తుత్తి డీఎస్సీ నిర్వహించాలనుకోవడం నిరుద్యోగులను దగా చేయడమేనని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జె.త్రినాథ్‌బాబు ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల ఆయన నిరసన వ్యక్తం చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో రాజానగరంలోని గాంధీ విగ్రహం వద్ద సంఘ సభ్యులతో కలిసి కొవ్వొత్తులు, ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా 50 వేల పోస్టులకు డీఎస్సీ నిర్వహిస్తామని ఊదర గొట్టిన ప్రభుత్వం కేవలం 6 వేలు పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తామని ఉసూరుమనిపించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు దశాబ్దాల తరబడి పోరాటం సాగించి రద్దు చేయించిన అప్రంటీస్ విధానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు సంబంధించి పునరాలోచన చేయకపోవడం విచారకరమన్నారు. వేతన సవరణ కమిటీ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేదని, కనీసం మధ్యంతర భృతిపై చర్చించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి నిదర్శనమని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు బండి ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శి వీరబాబు, జిల్లా నాయకులు భీమేశ్వరరావు, శైలజ, మండల నాయకులు చిన్నా మాస్టారు, గీత, వీరబాబు, ఉదయభాను, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 1: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో ఇంజనీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్‌లు, గణన సిద్ధాంతం అనే అంశం మీద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. వివిధ దేశాలకు, రాష్ట్రాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనబోతున్నారు. మొదటి రోజు ఉదయం కాన్ఫరెన్స్‌లో జేఎన్టీయూకే సీఎస్ఈ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.హెచ్‌ఎం కృష్ణప్రసాద్ ముఖ్య ఉపన్యాసకులుగా, మధ్యాహ్నం ఎన్ఐటీ పుదుచ్చేరిలో సీఎస్‌సీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సురేంద్రన్ ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొనబోతున్నారు. రెండో రోజు కాన్ఫరెన్స్‌లో ముఖ్య ఉపన్యాసకులుగా మలేషియాలో యూనివర్సిటీ టెక్నాలజీ పెట్రోనస్‌లో ఈఈఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇద్రివన్ ఇలాం వరుతీ పాల్గొంటున్నారని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పురోహితులు బ్యాట్ పట్టారు





క్రికెట్ ఆడుతున్న పురోహితులు

అంబాజీపేట, ఫిబ్రవరి 1: నిత్యం పూజలతో బిజీగా ఉండే పురోహితులు క్రికెట్ ఆడారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో గురువారం పంచెకట్టులో పురోహితులు సిక్సులు, ఫోర్లు బాదారు. రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం హోరాహోరీగా జరిగింది. క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 8 టీమ్స్ పాల్గొన్నాయి. నాలుగు జట్లు విజేతగా నిలిచాయని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం, కాకినాడ, విజయవాడ, కొవ్వూరు క్రికెట్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురు ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు విశాఖ జిల్లా నుంచి 18 మందిని, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 13 మందిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేయగా మొత్తం 31 మంది ఎంపీడీవోలకు మండలాలు కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఎ.రమణారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లా నుంచి వచ్చిన ఎంవీ సువర్ణరాజు (దేవీపట్నం), వీవీ రవికుమార్ (అనపర్తి), వి.హేమసుందరరావు (కోరుకొండ), కె.వసంత (గోకవరం), వి.విజయలక్ష్మి (బిక్కవోలు), మేరీ జోసీ (ఆలమూరు), కేవీ నరసింహారావు (ముమ్మిడివరం), ఎన్‌వీ రామచంద్రమూర్తి (రామచంద్రపురం), ఎం.విజయకుమార్ (శంఖవరం), ఎ.జయప్రకాశరావు (గొల్లప్రోలు), ఎస్‌డీ శ్యామ్ సుందర్ (సామర్లకోట), ఎస్.డేవిడ్‌రాజు (ప్రత్తిపాడు), ఎన్.జయమాధవి (కోటనందూరు), ఎన్.హనుమంతరావు (గండేపల్లి), కె.ప్రభాకరరావు(తాళ్లరేవు), బి.రమేష్ నాయుడు (కాకినాడ రూరల్), పి.ఆశాజ్యోతి (పెదపూడి), ఎం.ఉషారాణి (పెద్దాపురం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వచ్చిన ఎం.మురళీకృష్ణ (ఎటపాక), జీఏకేఎస్‌వీ జ్యోతిర్మయి (రాజానగరం), జీఆర్ మనోజ్ (కడియం), కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ (సీతానగరం), కె.శ్రీదేవి (కాట్రేనికోన), ఎస్.వేణుగోపాలరెడ్డి(మామిడికుదురు), ఎస్.వెంకటేశ్వరరావు (ఆత్రేయపురం), కె.వాణి(కొత్తపేట), ఎండీ అమీలు జమాహ్ (ఐ.పోలవరం), కె.వెంకటలక్ష్మి (రాయవరం), సీహెచ్ త్రిశూల (పి.గన్నవరం), ఎ.శ్రీనివాస్ (రావులపాలెం), టి.సూర్యనారాయణమూర్తి (అయినవిల్లి) ఎంపీడీవోలుగా నియమించారు.

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

టీడీపీ-జనసేన కూటమికి 140 అసెంబ్లీ సీట్లు: చిన్నయ్యదొర



బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని ఉమ్మడి ఏపీ మునిసిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. జగన్ మాటలు నమ్మి అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో చిన్నయ్యదొర విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జనసేన కూటమికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని వచ్చే ఎన్నికల్లో 140 అసెంబ్లీ సీట్లు సాధించి ఈ కూటమి అధికారంలోకి రాబోతోందని దీనిని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కోటి యాభై లక్షల మందికి సంక్షేమ పథకాలు అందించామని సీఎం జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడే జగన్ రాజకీయ కుట్రకోణం బయటపడిందని దీనిని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని చిన్నయ్యదొర తెలిపారు.

ఓటు వేయాలంటే ఎంతో కష్టం!



ఇలా రావాల్సిందే..

మోతుగూడెం, ఫిబ్రవరి1: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో అతి మారుమూల గ్రామమైన ఏరువాడ గ్రామస్థులు ఓటు వేయాలంటే పెద్ద పెద్ద వాగులు, వంకలు ఎతైన గుట్టలు దాటి రావాల్సిందే. ఏరువాడ గ్రామంలో 106 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామంలో 45 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా చదలవాడ తులసిపాక వచ్చి ఓటు వేయాలి. సుమారు 11 కిలోమీటర్లు దూరం దట్టమైన అడవిమార్గం ద్వారానే వాగులు దాటి వచ్చి ఓటు వేయాల్సి ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో అక్కడ ఓటర్లు ఇలా వచ్చి ఓట్లు వేస్తున్నారు. ఈ సారైనా గ్రామస్థుల కష్టాలు తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

నవోదయ అడ్మిట్ కార్డుల విడుదల

పెద్దాపురం, ఫిబ్రవరి 1: జవహర్ నవోదయలో 9, 11 తరగతిలో లేటరల్ ఎంట్రీ ప్రవేశపరీక్ష అడ్మిట్ కార్డులు విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం చెప్పారు. 9,11 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు నవోదయ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో ఆరు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు.

రోడ్డు కోసం గ్రామస్థుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 1: ఆర్అండ్‌బీ రహదారిని ఆధునికీకరించాలంటూ జనం రోడ్డెక్కారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో ఓఎన్జీసీ చమురు ట్యాంకర్లను అడ్డుకుని ఆందోళనకు దిగారు. అమలాపురం-ఎస్.యానాం రహదారి నిర్వహణ బాధ్యత రవ్వ, ఓఎన్జీసీ జాయింట్ వెంచర్‌దేనన్న సంగతి తెలిసిందే. కేజీ బేసిన్ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల చమురు బావుల నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం అన్‌లోడింగ్ పాయింట్‌కు రోడ్డు మార్గంలో ట్యాంకర్ల ద్వారా ముడి చమురు రవాణా జరుగుతోంది. ఈ కారణంగా ఆర్అండ్‌బీ రహదారి తరచూ గోతులు పడి శిథిలావస్థకు చేరడం సాధారణమై పోయింది. గతంలో స్థానిక ప్రజల ఆందోళన ఫలితంగా ఈ రహదారి నిర్వహణ బాధ్యత తమదేనని చమురు సంస్థలు ఉన్నతాధికారుల సమక్షంలో రాతపూర్వకంగా అంగీకరించాయి. అయితే ఇటీవల రహదారి గోతులమయంగా మారిందని, ఎన్నోసార్లు ఫిర్యాదు చేయగా కొంత మేర గోతులను తాత్కాలికంగా పూడ్చి చేతులు దులుపుకున్నారన్నది ఆందోళనకారుల ఆరోపణ. నెల రోజుల్లో గోతుల్లో పడి నలుగురు గాయపడ్డారని, తక్షణం రహదారిని ఆధునికీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. రవ్వ యాజమాన్యాన్ని అడిగితే ఆర్అండ్‌బీకి నిధులిచ్చామంటున్నారని, ఆర్అండ్‌బీ అధికారులు నిధుల సంగతి తమకు తెలియదంటున్నారని ఆందోళనకారులు అంటున్నారు. అసలు విషయం తేలే వరకు ఓఎన్జీసీ వాహనాలను కదలనిచ్చేదిలేదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, ఉప సర్పంచ్ చీకురుమెల్లి సత్యనారాయణ, దంగేటి బాబులు, భోగిశెట్టి నర్సింగ్, ఆకుల జోగయ్యనాయుడు, సుంకర చిన్నా తదితరులు ఆందోళనకు నాయకత్వం వహించారు.

కాకినాడ

కొనసాగుతున్న ఆటల పోటీలు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి1: ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో రెండోరోజు కొనసాగాయి. కబడ్డీలో జగ్గంపేట జట్టు మొదటిస్థానంలో నిలవగా కాకినాడ అర్బన్, పిఠాపురం తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి. వాలీబాల్‌లో కాకినాడ రూరల్ జట్టు విజయం సాధించింది. క్రికెట్‌లో కాకినాడ అర్బన్ జట్టు విజయం సాధించింది.

అధికారుల బదిలీలు.. సత్కారాలు

ప్రత్తిపాడు ఎంపీడీవోగా డేవిడ్‌రాజు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1: ప్రత్తిపాడు ఎంపీడీవోగా ఎస్.డేవిడ్‌రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. నర్సీపట్నం సమీపంలోని గొలుగుండ ఎంపీడీవోగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడ విధుల్లోకి చేరారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవో పనిచేసిన కుమార్‌బాబు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.డేవిడ్‌రాజును ఎంపీపీ జీకే సుధాకర్, మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

పెద్దాపురం ఎంపీడీవోగా ఉషారాణి

పెద్దాపురం,ఫిబ్రవరి1: మండల ఎంపీడీవోగా ఎం.ఉషారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఏఎస్ఆర్ జిల్లా డుమ్రీగూడా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బత్తిన అశోక్‌కుమార్ పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను ఈవోపీఆర్డీ కాగితాల రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం ఎంపీడీవోగా విజయకుమార్

శంఖవరం, ఫిబ్రవరి 1: ఎన్నికల విధుల్లో భాగంగా మండలంలో కీలక అధికారులు బదిలీ అయ్యారు. తహసీల్దారు సుబ్రహ్మణ్యాన్ని పెద్దాపురం డీఏవోగా బదిలీ చేయగా కృష్ణా జిల్లా నుంచి వి.రాజకుమారిని ఇక్కడకు బదిలీ చేశారు. ఎంపీడీవోగా ఎం.విజయకుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అధికారులు ఇద్దరూ గురువారం విధుల్లో చేరారు.

సామర్లకోట ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్

సామర్లకోట, ఫిబ్రవరి 1: ఎంపీడీవోగా ఎస్‌డీ శ్యామ్‌సుందర్ గురువారం సామర్లకోట చేరుకుని కార్యాలయ పరిపాలనాధికారి మంగతాయారునుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖ జిల్లా చోడవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన డి.శ్రీలలిత తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్యాంసుందర్‌ను కార్యాలయ ఏవో, ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యారెడ్డి తదితరులు కలిసి అభినందించారు.

కాకినాడ రూరల్ ఎంపీడీవోగా రమేష్‌నాయుడు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1: కాకినాడ రూరల్ ఎంపీడీవోగా విశాఖ జిల్లా సబ్బవరం ఎంపీడీవో బి.రమేష్‌నాయుడును ప్రభుత్వం నియమించగా గురువారం ఆయన రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎంపీడీవో కర్రె స్వప్న పాయకరావుపేటకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్‌నాయుడ్ని కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సుధీర్, పవన్ కలిసి అభినందనలు తెలిపారు.

నగర పంచాయతీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గొల్లప్రోలు, ఫిబ్రవరి 1: గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరుగా టి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ సెక్రటరీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ కమిషనరుగా పనిచేసిన ఎం.సత్యనారాయణను తిరిగి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు పంపుతూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

తహశీల్దార్ కుమారికి వీడ్కోలు

సామర్లకోట, ఫిబ్రవరి 1: సామర్లకోట తహశీల్దార్‌గా పనిచేసిన కుమారి ఏలూరుకు బదిలీ కావడంతో గురువారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆమెను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు మామిడాల కామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బదిలీ అయిన తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారిని పూలమాలలతో ముంచెత్తి శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు సత్కారం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, సర్వే డీటీ పవన్‌కుమార్, ఎంఎస్వో కీర్తి, తదితర వీఆర్వోలు, సర్వే సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ గోపాలకృష్ణకు వీడ్కోలు

ప్రత్తిపాడు,ఫిబ్రవరి 1: ప్రత్తిపాడు తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న వీవీవీ గోపాలకృష్ణను గురువారం లయన్స్‌కమ్యూనిటీ హాల్లో పౌరసన్మానం నిర్వహించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి, ఎనలేని సేవలందించారని పలువురు అన్నారు. తహసీల్దార్‌ను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, ధర్నాలకోట శ్రీను, పంచాది వీరబాబు, న్యాయవాదులు చలంకూరి రామకృష్ణ, బి.మధుబాబు, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

టీడీపీ యాప్ ర్యాంకర్లకు అభినందన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1: మన టీడీపీ యాప్‌కు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన గుమ్మిడి శ్రీనివాస్, గుమ్మిడి మోహన్‌సూర్యలను గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ అభినందించారు. వీరికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన సైకిల్ మెమొంటోలను అందజేశారు.

టీడీపీ అధికారంలోకి రాగానే చేనేతకు వర్షాకాల భృతి

» టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వర్మ

కొత్తపల్లి, ఫిబ్రవరి 1: త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అధికారంలోకి రాగానే చేనేత కార్మికులకు వర్షాకాల భృతి మంజూరు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ అన్నారు. కొత్తపల్లి శివారు రవీంద్రపురంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, మన ఇంటికి-మన వర్మ కార్యక్రమంలో కరపత్రాలను చేనేత కార్మికులకు ఆయన పంపిణీ చేశారు. చేనేత కార్మికులు వర్షాకాలంలో గోతుల్లో నీరు చేరడంతో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొనడాన్ని గుర్తించామన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు అనిశెట్టిసత్యానందరెడ్డి, పార్టీ నాయకులు రావు అక్షయ్, చేనేత నాయకులు రాపర్తి సూరిబాబు, ఈశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

గండేపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గండేపల్లి, ఫిబ్రవరి 1: గండేపల్లిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలో జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన వైసీపీ నేత కందుల చిట్టిబాబు వెయ్యిమందితో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందు కందుల చిట్టిబాబు పార్టీలోకి చేరిన వారితో బైక్ ర్యాలీ నిర్వహించి మురారిలో ఎన్టీఆర్‌కి, టీడీపీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలు అందించిన చిట్టిబాబు సోదరుడు కొండయ్యదొర విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మురారినుంచి నీలాద్రిపేట వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి గ్రామ శివారులో ఉన్న బాలాజీ ఫంక్షన్ హాల్లో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ కొండయ్యదొర కుటుంబంతో ఎప్పటినుంచో అనుబంధం ఉందన్నారు. చిట్టిబాబు రాకతో పార్టీ మరింత బలపడుతుందన్నారు. కందుల చిట్టిబాబు మాట్లాడుతూ టీడీపీ అంటే తనకు ఎనలేని అభిమానమన్నారు. మళ్లీ సొంత గూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, కందుల వినయ్, విజయ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడబాల భాస్కరరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, వెలమాటి కాశీ పాల్గొన్నారు.



గండేపల్లిలో చిట్టిబాబును పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెహ్రూ



జగ్గంపేటలో పార్టీలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

మామిడాడలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

జగ్గంపేట, ఫిబ్రవరి 1: జగ్గంపేట మండలం మామిడాడ గ్రామ ఉపసర్పంచ్ వైసీపీ నేత అల్లు రామరాజు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. అల్లు రాజు, అల్లు సత్తిబాబు, అల్లు అవతారం, అల్లు పోతురాజు, అల్లు దుర్గ, అల్లు శ్రీను, అల్లు రాము, అల్లు శ్రీను, అల్లు రాఘవ, అల్లుకుమార్, కసిరెడ్డి అప్పారావు, కోట సత్తిబాబు, అల్లు సతీష్, అల్లు శివ, అల్లు వెంకట అర్జున్ టీడీపీలోకి చేరారు. వీరిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మామిడాడ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'పేదల భవిష్యత్‌కు చంద్రబాబే గ్యారెంటీ'

తుని రూరల్, ఫిబ్రవరి 1: పేదల భవిష్యత్‌కు చంద్రబాబే గ్యారెంటీ అని తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య స్పష్టం చేశారు. కొత్త సీతయ్యపేటలో యనమల దివ్య పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేసి సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్,బొట్టా దేవుళ్ళు, గొర్ల తాతీలు, తమరాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీకి పరాజయం తప్పదు: మహాసేన రాజేష్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికల్లో అధికార వైసీపీ పరాజయం పాలవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ స్టీరింగ్ కమిటీ సభ్యులు మహాసేన రాజేష్ తెలిపారు. స్థానిక తోట వీధిలోని టీడీపీ కార్యాలయంవద్ద నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం, రౌతులపూడి, ఏలేశ్వరం నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ తరగతుల్లో పాల్గొన్న మహాసేన రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసీపీ ఓడిపోవడం ఖాయమైందని, అందుకే ఆ పార్టీ ఎన్నికలు అంటే భయపడుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల పథకాలను రద్దు చేసి దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దళితులపైనే దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. సమావేశంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జ్ సత్యప్రభ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సభ్యులు పార్టీ మేనిఫెస్టో అంశాలు ప్రజలకు వివరించాలని, బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, ఓటర్ల జాబితా, కుటుంబ సాధికారత సారథులు, టెలిగ్రాం వినియోగం, బూత్ ఫారం నమోదు వంటి అంశాలపై శిక్షణలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమావేశాల్లో ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, వెన్నా శివ, బచ్చల గంగ, అమరాది వెంకట్రావు, సూది బూరయ్య, పర్వత సురేష్, బద్ది రమణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఇతంశెట్టి భాస్కరబాబు, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, పసగడుగుల రమణ పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశంలో మాట్లాడుతున్న మహాసేన రాజేష్

సమస్యలు పరిష్కరించాలంటూ భవన నిర్మాణ కార్మికుల ధర్నా

పిఠాపురం, ఫిబ్రవరి 1: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. జగన్ సర్కార్ భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తహసీల్దారు పితానిత్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు కుంచే చిన్నా,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పి.చిరంజీవి, ఏ.మోహనాచార్యులు, సత్తిబాబు, కిరణ్‌కుమార్, బ్రహ్మాజీ, అర్జున్‌రావు పాల్గొన్నారు.

పిఠాపురంలో న్యాయవాదుల వంటావార్పు

పిఠాపురం, ఫిబ్రవరి 1: ప్రజల హక్కులను హరించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు వంటావార్పు నిర్వహించారు. పట్టణంలోని కోర్టుల వద్ద నిరాహారదీక్షలు నిర్వహిస్తున్న శిబిరంవద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ యాక్టు వల్ల అనేక నష్టాలు ఉన్నాయని న్యాయవాదులంతా ముక్తకంఠంతో చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పిఠాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం యాక్టును ఉపసంహరించుకునే వరకూ తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.



వంటావార్పు నిర్వహిస్తున్న న్యాయవాదులు

'పట్టాలు ఇచ్చే వరకు ఉద్యమం ఆపేదేలేదు'

తాళ్లరేవు, ఫిబ్రవరి 1: స్థానికంగా ఉన్న చొల్లంగి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేవరకు ఉద్యమం ఆపేదేలేదని సీపీఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. గురువారం చొల్లంగిలో లబ్ధిదారులు నిరసన దీక్షను చేపట్టగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, సీపీఎం నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలురైతు జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, జనసేన మండల కన్వీనర్ అత్తిలి బాబూరావు నిరసనకారులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, జనసేన గ్రామ కన్వీనర్ కనకాల పెదబాబు, టీడీపీనాయకులు గగ్రే లక్ష్మీనారాయణ, మేడపాటి దేవా, శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చొల్లంగిలో ఇళ్లస్థలాల లబ్ధిదారుల నిరసన

చొల్లంగి స్థలాలను పరిశీలించిన కరప ఎస్ఐ

చొల్లంగి ఇళ్లస్థలాల్లో సర్వేరాళ్లను కరప పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ, కోరింగి ఏఎస్ఐ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. అనంతరం చొల్లంగిలో ఇళ్ల స్థలాల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న టీడీపీ మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులుతో మాట్లాడారు. దీక్షాశిబిరం టెంట్‌ను తొలగించమని నిరసన తెలపవద్దని, ఇబ్బందులుంటే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని ఎస్ఐ చెప్పారు. తాము ఎవ్వరికి ఇబ్బంది కల్పించే పనులు చేయమని, శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని, సహకరించాలని నిరసనకారులు తెలిపారు.

110 లీటర్లసారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపల్లి, ఫిబ్రవరి 1: కోనపాపపేట జీడిమామిడి తోటల్లో నిర్వహించే సారా బట్టీలపై కొత్తపల్లి పోలీసులు గురువారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారా తయారు చేసే వాసంశెట్టి సతీష్‌ను అరెస్ట్ చేసి అతడినుంచి 110లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ స్వామినాయుడు చెప్పారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపామన్నారు.

లారీలకు అపరాధ రుసుము

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా గురువారం అధిక లోడులతో రవాణా చేస్తున్న మూడు లారీలకు శంఖవరానికి చెందిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ అపరాధ రుసుము విధించారు. ఈ టిప్పర్ లారీలు పరిమితికి మించి అధిక లోడులతో సరుకును రవాణా చేస్తుండడంతో ఈ చర్యలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నవరం దేవస్థానంలో 188 గోవులకు డీవార్మింగ్

అన్నవరం ఫిబ్రవరి 1: అన్నవరం దేవస్థానంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో ఉన్న 188 ఆవులకు గురువారం పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ పీతల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు ప్రసాదరావు, డాక్టర్ లావణ్య డీవార్మింగ్ చేశారు. దీనిద్వారా గోవుల కడుపులో ఉన్న వ్యర్థాలు తొలగిపోవడమే కాకుండా భవిష్యత్‌లో సీజనల్ వ్యాధులు రాకుండా కాపాడుతాయన్నారు. గోశాల సూపరెంటెండెంట్ ఐవీ రామారావు ఉన్నారు.

ఉపాధ్యాయులను ప్రభుత్వం మోసగిస్తోంది

పెద్దాపురం, ఫిబ్రవరి 1: ఉపాధ్యాయులను ప్రభుత్వం మోసగిస్తోందని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఫిలిప్‌రాజు, శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక విలేఖరులతో వారు గురువారం మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వాన్ని 50వేల టీచర్ పోస్టులు భర్తీ చేయలేదని, తాము వస్తే భర్తీ చేస్తామని చెప్పి ఒక్కసారి కూడా డీఎస్సీ వేయలేదని అన్నారు. చివరికి ఆరువేల పోస్టులు భర్తీ చేస్తామని రెండేళ్లపాటు అప్రంటీస్ విధానంలో రూ.1200, రూ.1500 జీతం ఇచ్చి వెట్టి చాకిరీ చేయించారన్నారు. మున్సిపల్ టీచర్లకు సరైన సర్వీస్ రూల్సు రూపొందించి వెంటనే బదిలీలు పదోన్నతులు కల్పించాలని, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'చిన్నస్థాయి స్టార్టప్‌లకు ఉపయోగపడేలా సాంకేతికత ఉండాలి'

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 1: చిన్నస్థాయి స్టార్టప్‌లకు ఉపయోగపడేలా సాంకేతికత, అప్లికేషన్లను అభివృద్ధి చేయాలని జేఎన్టీయూకే మాజీ ఉపకులపతి జి.తులసీరాందాస్ అన్నారు. యూనివర్సిటీలోని వీసీ సమావేశహాల్లో ఆవిష్కరణలను బలోపేతం చేయడం, ఇంక్యుబేషన్ సెంటర్ కార్యకలాపాలు అనే అంశంపై గురువారం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తులసీరాందాస్ మాట్లాడుతూ బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు సరైన మేనేజ్‌మెంట్ శిక్షణ, క్యాపిటల్ ఫైనాన్సింగ్‌తో స్టార్టప్‌ల అభివృద్ధికి కృషి చేసేలా తగిన సాంకేతికతను రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. వీసీ ప్రసాదరాజు తులసీరాందాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు సీహెచ్‌సాయిబాబు, గోపాలకృష్ణ, మురళీకృష్ణ, కృష్ణమోహన్, శ్యామ్‌కుమార్,బీటీ కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

'ఒప్పందాలను అమలు చేయకుంటే తిరిగి సమ్మె'

పిఠాపురం, ఫిబ్రవరి 1: మునిసిపల్ కార్మికులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి పూర్తిస్థాయిలో జీవోలు ఇచ్చి అమలు చేయకుంటే తిరిగి సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌పార్కులో గురువారం గౌరవాధ్యక్షుడు సాకా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఏపీ మునిసిపల్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లల్లో కార్మికులకు కాలనీ ఏర్పాటు ప్రధానమైనదన్నారు. జగ్గయ్యచెరువు కాలనీలో స్థలాన్ని కార్మికులకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్‌కు కాకినాడ, పిఠాపురం రెల్లిపెద్దలు వారికి సంఘీభావం తెలిపారు. సీపీఐ నాయకులు కేశవరపు అప్పలరాజు, ముత్యాల అప్పారావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	ధీర
లక్ష్మి	:	అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
సీ ఆండ్‌సీ1	:	బూట్‌కట్ బాలరాజు
సీ ఆండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య1	:	గుంటూరు కారం
సూర్య2	:	హనుమాన్

పల్స్ పోలియో ఏర్పాట్లపై సమీక్ష

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 1: జిల్లావ్యాప్తంగా ఈనెల 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లావైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 ఏళ్లలోపు వయస్సున్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 5ఏళ్ల లోపు 1.88 లక్షలమంది పిల్లలు ఉన్నారన్నారు. పల్స్‌పోలియో వ్యాక్సినేషన్ ప్రక్రియలో ప్రతి 250మంది పిల్లలకు ఒక బూత్ చొప్పున్న మొత్తం 1336 బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పల్స్ పోలియో నిర్వహణకు 2672మంది సిబ్బందిని నియమించామన్నారు. పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోయిన పిల్లలకోసం ఈనెల 4, 5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగించనున్నట్లు తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో, ఎస్ఎంవో డాక్టర్ జాన్ జూడే జాషువా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, ఎస్‌ఓ విజయలక్ష్మి, డెమో ప్రసాదరాజు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక సదస్సు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022-23లో నిర్వహించిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలపై శుక్రవారం ప్రజావేదికసదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి. రమేష్‌నాయుడు తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు జరిగిన పలు పనులపై జనవరి 22 నుంచి ఫిబ్రవరి 1 వరకు వివిధ గ్రామాల్లో బృందాలవారీగా సామాజిక తనిఖీలు నిర్వహించామన్నారు. సామాజిక తనిఖీల్లో వచ్చిన నివేదికను శుక్రవారం రమణయ్యపేట మండల కార్యాలయంవద్ద 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ్యులకు చదివి వినిపిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామాఖ్య సంఘాల సభ్యులు, ఉపాధి హామీ వేతనదారులు, మేట్లు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

జ్యోతిర్లింగాలకు పూజలు

జగ్గంపేట, ఫిబ్రవరి 1: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేకం నేపథ్యంలో తమిళనాడులోని రామేశ్వరంలో జ్యోతుల నవీన్, మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయంలో జ్యోతుల లక్ష్మీదేవి, భీమశంకర్, విశ్వేశ్వర్ జ్యోతిర్లింగాలో జ్యోతుల అనీష్ నెహ్రూ గురువారం పూజలు నిర్వహించారు.

'రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే ధ్యేయం'

శంఖవరం, ఫిబ్రవరి 1: వచ్చే పదేళ్లలో 50శాతానికి పైగా తగ్గించడమే ధ్యేయంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బి.శ్రీనివాస్ అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అన్నవరం ఎస్ఐ కిషోర్‌బాబుతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన నిర్వహించి బైక్ ర్యాలీ చేపట్టారు.

కాకినాడలో జనసేన 'మేము సిద్ధం'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్న వారికే జగన్ ప్రభుత్వం మద్దతిస్తోందని జనసేన సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ విమర్శించారు. రేచర్లపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. దళితులకు పథకాలు తీసేసిన జగన్‌పై యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం జగన్ నా ఎస్సీలు, ఎస్టీలు అంటూ మభ్యపెట్టి మోసం చేస్తున్నారని శశిధర్ అన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ పాల్గొన్నారు.

యనమల అభినందనలు

తుని రూరల్, ఫిబ్రవరి 1: పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ సోషల్ మీడియా ద్వారా టీడీపీకి సేవలు అందిస్తున్న టీడీపీ యువ నాయకులను మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అభినందించారు. తేటగుంటలోని ఆయన స్వగృహంలో వి.కొత్తూరుకు చెందిన బోజంకి నరేష్, అప్పలకొండ, కనకరాజులకు సైకిల్‌సింబల్ మెమోంటోను అందించారు.

నేడు తునిలో కరెంటు సరఫరా నిలుపుదల

తుని రూరల్, ఫిబ్రవరి 1: శుక్రవారం తుని పట్టణంలో పలు వార్డుల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఇండోర్ సబ్‌స్టేషన్స్ పరిధిలో మెయింటినెన్స్ కారణంగా ఎంఆర్‌పేట, ఫైర్‌ఆఫీస్, రామాథియేటర్, గొల్ల అప్పారావు సెంటర్, నక్కిన వీధి, ఫిష్ మార్కెట్, గరువువీధి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయశాఖ డైరీ ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1: జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కాకినాడలో వ్యవసాయశాఖ సమాచార దర్శిని డైరీని ఆశాఖ జిల్లా అధికారి బీవీఎస్ హరి ఆవిష్కరించారు. ఏఈవోల రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు సీహెచ్‌ఎన్‌వీ ప్రసాద్, జిల్లా మాజీ కార్యదర్శి సతీష్, ఏవీ రమణ, కృష్ణవేణి, మాజీ అధ్యక్షులు సింహాచలం, మూర్తి పాల్గొన్నారు.

జనసేన ఆర్థికసాయం అందజేత

ఉప్పాడ(కొత్తపల్లి), ఫిబ్రవరి 1: తలకు గాయమై చికిత్స పొందుతూ ఇంటి వద్దే ఉంటున్న ఉప్పాడకు చెందిన చింతకాయల యోబును పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ పిల్లా శ్రీధర్ గురువారం పరామర్శించారు. నగదుసాయాన్ని అందజేశారు. మత్స్యకార నాయకులు కంబాల దాసు, పల్లేటి బాపన్నదొర, గేదెల వెంకటరమణారావు, కొత్తపల్లి రాజు, పిల్లా వీరబాబు, సోదే శ్రీను పాల్గొన్నారు.

యండపల్లిలో నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి, ఫిబ్రవరి 1: యండపల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పిఠాపురం విష్ణు హాస్పటల్స్ అధినేత డాక్టర్ పిల్లా శ్రీధర్ తెలిపారు. రామాలయం సెంటర్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నామని ఆయన చెప్పారు.

రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 1: కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలోఈనెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు.ప్రైవేట్ కంపెనీల్లో పనిచేయడానికి అర్హతకలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లు, బయోడేటా జెరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాల ని తెలిపారు. వివరాలకు 08842373270కు సంప్రదించాలన్నారు.

కౌన్సిలర్ నక్కా లలిత మృతి




సామర్లకోట, ఫిబ్రవరి 1: సామర్లకోట పట్టణంలో 26వ వార్డు కౌన్సిలర్ అయిన నక్కా లలిత(39) అస్వస్థతతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందారు. ఆమెకు భర్త నక్కా శ్రీను, ఇద్దరు సంతానం ఉన్నారు. లలిత మృతిపట్ల పట్టణంలోని కౌన్సిలర్లు తీవ్ర సంతాపం తెలిపారు.

'తుని పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం'

తుని రూరల్, ఫిబ్రవరి 1: తుని పట్టణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి స్పష్టం చేశారు. తుని పట్టణంలో 30వ వార్డులో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులకు ఆమె శ్రీకారం చుట్టారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



కీ॥శే॥ ముత్యాల అనంతలక్ష్మి సత్యవతిదేవి

6-6-1932 : 24-1-2024

భర్త: కీ॥శే॥ శ్రీహరిరావు

మీ మరణానికి చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు

కుమారులు, కుమార్తెలు	కోడళ్ళు, అల్లుళ్ళు
వీర వెంకట సత్యనారాయణమూర్తి (పెదబాబు)	లక్ష్మి
నారాయణమూర్తి (చిన్నబాబు)	శ్రీలక్ష్మి
శ్రీనివాసరావు	భారతి
సరోజిని మాణిక్యాంబ	లేటు చంద్రు నారాయణమూర్తి
పద్మజ (రాణి)	లేటు చిట్టూరి మాధవరావు
సుబ్బలక్ష్మి (ఉష)	లేటు కూరపాటి శ్రీరామకృష్ణ
మాధవి	మార్ని అమ్మన్న చౌదరి
సూర్యలక్ష్మి (చంటి)	బైరపనేని శ్రీనివాసరావు

పెదకార్యం: 5-2-2024 సోమవారం చెల్లూరులోని మా స్వగృహమునందు జరుగును.